క్లుప్తంగా

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



గుడివాడ టౌన్: స్థానిక వాసవీ చౌక్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఈ వ్రతాలు నిర్వహించామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, కె. నారాయణరావు, మురళీకృష్ణ, జగ్గారావు, ఐ. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మణుగునూరులో వైఎస్సార్‌ సీపీ నేతల ప్రచారం



మండవల్లి: మండలంలోని మణుగునూరులో వైఎస్సార్‌ సీపీ నేతలు, ఎస్సీ నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌ యాదవ్‌, ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్‌)కు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి విజయం చేకూర్చాలని కోరారు. వైఎస్సార్‌ సీపీ నాయకులు మెండా సురేష్‌, నాగదాసి థామస్‌, బేబీ సరోజిని, బుంగా రాణి, ప్రసాద్‌ పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధన అందించాలి

మండవల్లి: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని డీఈఓ అబ్రహం ఉపాధ్యాయులకు సూచించారు. లింగాల జిల్లా పరిషత్‌ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం డీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. హైస్కూల్‌ హెచ్‌ఎం నాగలక్ష్మి, ఎంపీపీ స్కూల్‌ హెచ్‌ఎం మేడా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



ముదినేపల్లి రూరల్‌: సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎస్‌ఐ డి.వెంకట్‌కుమార్‌ అన్నారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు మండలంలోని పెదగొన్నూరు, కొరగుంటపాలెం, అల్లూరులో శుక్రవారం పోలీస్‌ కవాతు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక శక్తులు చొరబడకుండా ఎన్నికలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఎన్ని పార్టీలు జత కట్టినా మళ్లీ జగనే సీఎం



మహేశ్వరపురం(పెదపారుపూడి): ఎన్ని పార్టీలు జత కట్టి వచ్చినా రానున్న ఎన్నికల్లో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావటం తథ్యమని వైఎస్సార్‌ సీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి అన్నారు. మండలంలోని మహేశ్వరపురంలో ఆమె శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలను అందజేసి ఫ్యాన్‌ గుర్తుకే రెండు ఓట్లు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలను మోసగించేందుకే చంద్రబాబు కూటమి కట్టారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కైలే అనిల్‌కుమార్‌ను మరోసారి గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎంపీపీ గోగం సురేష్‌, పామర్రు మార్కెట్‌ యార్డు చైర్మన్‌ తుమ్మల ఉషారాణి, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, సర్పంచ్‌ జువ్వనపూడి రాజు, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ గొళ్ల సోమేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్‌ జాజుల చిన్నారి, వైఎస్సార్‌ సీపీ నాయకులు వేణుగోపాలరెడ్డి, పాతూరి బాబురావు, జి.మోహనరావు, కె.కోటేశ్వరరావు, సుజాత, శ్రీధర్‌, టి.కోటేశ్వరరావు, దాసు, రాంప్రసాద్‌, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వానికి మద్దతు పలకండి

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



మహిళ సమస్యకు పరిష్కారం తెలుపుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ మద్దతు పలకాలని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 11, 12, 13, 15 వార్డులలో శివారు ప్రాంతాల్లో శుక్రవారం ప్రచారం చేశారు. తొలుత బైపాస్‌ రోడ్‌ బాలుర హాస్టల్‌ వద్ద నుంచి ప్రచారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ రెండు ఓట్లు ఫ్యాన్‌ గుర్తుకు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్‌ సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించాలని కోరారు. అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం తమ పార్టీకి చేతకాదన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు పాలనలో కేవలం జన్మభూమి కమిటీలు, టీడీపీ కార్యకర్తలకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వంలో పేదరికాన్ని మాత్రమే కొలమానంగా తీసుకుని అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుత ఎన్నికలు పేదరిక నిర్మూలన, పెత్తందారీ వ్యవస్థల మధ్యన జరుగుతున్నాయని, ఎవరి పాలన మేలు చేస్తుందో ప్రజలు గుర్తించాలని అందుకు అనుగుణంగా ఓట్లు వేసి వైఎస్సార్‌ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ నాయకులు, అభిమానులు, మహిళా సంఘం నాయకులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి



ఆలపాడులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్‌ సతీమణి వీరాకుమారి



పెనుమల్లిలో ప్రచారం చేస్తున్న దూలం స్వాతి, నాయకులు

ముదినేపల్లి రూరల్‌: నియోజకవర్గంలో ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు పట్టం కట్టాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్‌) కోడలు దూలం స్వాతి అన్నారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మతో కలిసి మండలంలోని పెనుమల్లి, సంఘర్షణపురం, సింగారం గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే డీఎన్నార్‌ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా సహకరించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కారుమూరి సునీల్‌కుమార్‌ యాదవ్‌, డీఎన్నార్‌కు ఫ్యాన్‌ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. హౌసింగ్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ గంటా సంధ్య, వైస్‌ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, పార్టీ నాయకులు మోట్రు ఏసుబాబు, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

కైకలూరు: ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్‌) సతీమణి వీరాకుమారి కోరారు. ఆలపాడులో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్‌, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ యాదవ్‌కు ఫ్యాన్‌ గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు నల్లగచ్చు ధనలక్ష్మి, నాయకులు పడమటి శేషావతారం, బండి విష్ణు, సలాది వెంకన్న, నగేష్‌, శాఖమూరి రాజా, విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు మరువలేం

తోట్లవల్లూరు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సర్దార్‌ గౌతు లచ్చన్న సాగించిన పోరాటాలను, సేవలను ఎన్నటికీ మరువబోమని బీసీ జనగణన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రొయ్యూరులో దివంగత మాజీ మంత్రి, బీసీల ఆరాధ్య దైవం గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. గౌతు లచ్చన్న విగ్రహానికి లుక్కా వెంకట శ్రీనివాసరావు, సర్పంచ్‌ నిమ్మగడ్డ ప్రభుదాస్‌, పీఏసీఎస్‌ అధ్యక్షుడు లుక్కా విజయగౌడ్‌ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

430 మందికి వైద్యసేవలు



పెదపూడి(మొవ్వ): మొవ్వ పీహెచ్‌సీ పరిధిలోని పెదపూడి సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో 430 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యాధికారులు డాక్టర్‌ ఎం.వేదరాజ్‌(మొవ్వ) డాక్టర్‌ డి.ఉమామహేష్‌ బాబు(104), డాక్టర్‌ ఎం.శైలూష(గూడూరు), ఆప్తామాలజిస్ట్‌ ఎస్‌.సాయి శ్రీలక్ష్మి (తోట్లవల్లూరు) కంటి పరీక్షలు నిర్వహించారు. పెదపూడి సచివాలయ ఏఎన్‌ఎం జి బుజ్జి, సీహెచ్‌ఓ విజయకుమార్‌, ఆరోగ్య కార్యకర్త రామాంజనేయులు పాల్గొన్నారు.

23న ఆలయ భూముల కౌలు వేలం

పామర్రు: మండలంలోని కాపవరం, నిమ్మకూరులోని ఆలయాల భూముల కౌలు పాట ఈనెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్‌ కందుల వెంకటరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ నిమ్మకూరులోని శ్రీ బుద్ధేశ్వరస్వామి ఆలయానికి చెందిన 9.53 ఎకరాల మాగాణి భూమిని మూడేళ్ల పాటు కౌలు చేసుకునేందుకు ఆసక్తి గల రైతులు 23వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయంలో జరిగే వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు. పాటలో పాల్గొనే వారు రూ.10వేల ధరావత్తు చెల్లించాలన్నారు. కాపవరంలో కపర్థేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 11.75 ఎకరాల భూమిని మూడేళ్ల పాటు పంట సాగు చేసుకునే నిమిత్తం ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాటలో పాల్గొనేవారు రూ.30వేల ధరావత్తుగా చెల్లించి పాటలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

కైకలూరు: మండల పరిధిలోని కై కలూరు, పల్లెవాడ, వరహాపట్నం విద్యుత్‌ ఉప కేంద్రాల్లో మరమ్మతులు, విద్యుత్‌ లైన్ల ఏర్పాటు నిమిత్తం శనివారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గుడివాడ విద్యుత్‌ శాఖ ఈఈ కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కైకలూరు మండలం మొత్తం గ్రామాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



కైకలూరులో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



పామర్రులో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



గుడివాడలో ఉద్యోగులతో ప్రయోగాలు చేయిస్తున్న ఫైర్‌ సిబ్బంది

మొవ్వ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక కేంద్రం అధికారులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, కూచిపూడి గ్రామంలోని సంజీవని వైద్యాలయంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఫైర్‌ ఆఫీసర్‌ జి.వెంకటేశ్వరరావు, సిబ్బంది ఎం.యోగానంద్‌ తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: వేసవిలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరగటానికి అవకాశం ఉంటుందని ఇందుకు ప్రజలు అప్రమత్తంగా తగు జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాలను అరికట్టాలని పామర్రు విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి ఎన్‌.రాంబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామంలోని పెట్రోల్‌ బంకుల వద్ద అగ్ని ప్రమాదాల నివారణ జాగ్రత్తలపై ప్రజలకు పెట్రోల్‌ బంక్‌ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అందరికీ అగ్నిమాపక నియంత్రణ సూత్రాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే స్పందిస్తే ప్రమాదాన్ని ఇట్టే నివారించవచ్చని జిల్లా అసిస్టెంట్‌ ఫైర్‌ ఆఫీసర్‌ జె.ఆంజనేయులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, ఇతర కార్పొరేట్‌ హాస్పిటల్స్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎస్‌.ఇందిరాదేవి పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: కైకలూరు కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌ (సీహెచ్‌సీ), వర సంజీవని ఆస్పత్రిలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్‌, సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ శ్రీనివాసరావు, వర సంజీవని డాక్టర్‌ పుల్లేశ్వరరావు, అగ్నిమాపకశాఖ సిబ్బంది ఎం.రామ్‌భాస్కరరావు, బి.శ్రీనివాసరావు, ఎం.పరశురాముడు, ఎం.రవీంద్రబాబు, సీహెచ్‌ శ్రీనివాసరావు, ఆర్‌ మురళీకృష్ణ, పి.ఏసుబాబు, సీహెచ్‌ గణేష్‌, వి.అంజిబాబు, డి.రవీంద్రబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వారు ఇంటివద్దే ఓటింగ్‌

మోపిదేవి: దివ్యాంగులు, 85 ఏళ్లు నిండిన వృద్ధులకు సార్వత్రిక ఎన్నికల్లో వారి ఇంటివద్దనే ఓటింగ్‌ చేసే అవకాశం కల్పించినట్లు తహసీల్దార్‌ శ్రీ విద్య తెలిపారు. తహసీల్దార్‌ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బీఎల్వోల సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్‌ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి బూత్‌ లెవెల్‌లో ఉన్న పీడబ్ల్యూడీ వికలాంగులు, వృద్ధులను గుర్తించి వారి నుంచి అంగీకార పత్రాలు స్వీకరించాలని సూచించారు. మండలంలోని 38 పోలింగ్‌ బూత్‌ల్లో ఇలాంటి వారు 700కు పైగా ఓటర్లు వివిధ రకాల పింఛన్లు పొందుతుండగా 52 మంది పోలింగ్‌ బూత్‌ వద్దకు రాలేమని చెప్పడంతో వారి నుంచి అంగీకార పత్రాలు స్వీకరించాలని ఆదేశించారు. మిగిలినవారి నుంచి కూడా పోలింగ్‌ బూత్‌ వద్దకు వస్తామని అంగీకార పత్రాలు తీసుకోవాలని చెప్పారు.

విమాన గోపుర ప్రతిష్టా మహోత్సవం

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతామందిరం విమాన గోపుర ప్రతిష్టా మహోత్సవం పురస్కరించుకుని శుక్రవారం వాస్తు పూజా కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు దాశరథి శ్రీనివాస దీక్షితులు పూజలు చేశారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి దంపతులు పాల్గొన్నారు. ప్రతిష్ట మహోత్సవం పురస్కరించుకుని మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు పర్యవేక్షించారు.

వైభవంగా రథోత్సవం

ముదినేపల్లి రూరల్‌: సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి కల్యాణోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి గ్రామంలో రథోత్సవం వైభవంగా జరిగింది. సీతారాముల ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి ప్రధాన వీధుల్లో రథోత్సవాన్ని నిర్వహించగా భక్తులు హారతులతో స్వాగతం పలికారు. ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే లాభాలు

కైకలూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా మానవులకు అనేక లాభాలు కలుగుతాయని గో ఆధారిత వ్యవసాయ శాస్త్రవేత్త, సేవ్‌ సంస్థ వ్యవస్థాపకుడు విజయ్‌రామ్‌ అన్నారు. స్థానిక రామకృష్ణ సేవా సమితి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా మానవ జీవనం మనుగడ కోల్పోవడం అనే అంశంపై అవగాహన సదస్సును ఎన్జీవోస్‌ కాలనీ రామకృష్ణ సేవా సమితి వద్ద శుక్రవారం నిర్వహించారు. శాస్త్రవేత్త విజయ్‌రామ్‌ మాట్లాడుతూ దేశీ విత్తనాలతోనే మనకు ఆరోగ్యం కలుగుతుందన్నారు. బాపట్ల రామకృష్ణ సేవా సమితి సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాసరావు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ, సభ్యులు గుర్రం శ్యామ్‌, స్థానిక రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు భూపతిరాజు వెంకటేశ్వరవర్మ, నరహరిశెట్టి శ్రీరామకృష్ణ, మట్టా రాజేంద్రప్రసాద్‌ పాల్గొన్నారు.

గుడివాడలో రెండు నామినేషన్లు దాఖలు

గుడివాడ టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు రెండు నామినేషన్లు శుక్రవారం దాఖలు అయినట్లు గుడివాడ ఆర్డీఓ, రిటర్నింగ్‌ అధికారి పి.పద్మావతి తెలిపారు. జాతీయ కాంగ్రెస్‌ పార్టీ తరఫున వడ్డాది గోవిందరావు(రాజేష్‌), బహుజన సమాజ్‌ పార్టీ తరఫున గుడివాడ బోస్‌బాబు నామినేషన్‌ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

కైకలూరులో మూడు..

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గం నుంచి శుక్రవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. జై భీంరావ్‌ భారత్‌ పార్టీ (జేబీపీ) నుంచి మండవల్లి మండలం భైవరపట్నం గ్రామానికి చెందిన గొంతుపులుగు సతీష్‌కుమార్‌, ఇండియన్‌ నేషనల్‌ కాంగ్రెస్‌ (ఐఎన్‌సీ) నుంచి కైకలూరుకు చెందిన బొడ్డు నోబుల్‌, బొడ్డు దానియేల్‌ నోబుల్‌లు నామినేషన్లను స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి కె.భాస్కర్‌కు అందించారు. షాడో రిటర్నింగ్‌ అధికారి, శిక్షణ కలెక్టరు శ్రీపూజిత నామినేషన్ల తంతును పర్యవేక్షించారు. కైకలూరు సర్కిల్‌, టౌన్‌ సీఐలు బి.కృష్ణకుమార్‌, ఆకుల రఘు బందోబస్తు నిర్వహించారు.

పేదల సంక్షేమం కోసం జగన్‌ను గెలిపించుకోవాలి



కురుమద్దాలిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ సోదరి అనిత

కురుమద్దాలి(పామర్రు): పేదలకు సంక్షేమ ఫలాలు సక్రమంగా అందాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ సోదరి కె.అనిత అన్నారు. మండలంలోని కురుమద్దాలిలో ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద వర్గాల అభ్యున్నతి పొంది ఆర్థిక పరిపుష్టి సాధించాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ కావాలన్నారు. ఎమ్మెల్యేగా కైలే అనిల్‌కుమార్‌ను, మచిలీపట్నం ఎంపీగా సింహాద్రి చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్‌, జెడ్పీటీసీ సభ్యురాలు కె స్వరూపరాణి, వైస్‌ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వరమ్మ, పీ రత్నకుమారి పాల్గొన్నారు.

కొడాలి నాని గెలుపే లక్ష్యం



తుమ్మలపల్లిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ, నాయకులు

నందివాడ: ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ల గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎంపీపీ పెయ్యల ఆదాం పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కొడాలి నానికి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గాకుమారి, మండల నాయకులతో కలసి శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి, రెండు ఓట్లు ఫ్యాన్‌ గుర్తుకు వేయాలని కోరారు. వైఎస్సార్‌ సీపీ నాయకులు గూడపాటి వెంకటేశ్వరరావు, కందుల నాగరాజు, దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌, సుందరరావు, తోట నాగరాజు, అమృతబాబు, కొండపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాగూర్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతో గ్రామ స్వరాజ్యం సాకారం



కొచ్చెర్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న శ్రీఅనుపమ, నాయకులు

కలిదిండి: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందని సచివాలయ, వలంటీర్‌ వ్యవస్థలతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన వచ్చిందని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్‌) కోడలు శ్రీఅనుపమ అన్నారు. కొచ్చెర్లలో శుక్రవారం వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీఅనుపమ మాట్లాడుతూ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌ కుమార్‌ యాదవ్‌కు, కై కలూరు అసెంబ్లీ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావుకు భారీ మెజార్టీతో విజయాన్ని అందించాలని కోరారు. వైస్‌ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్‌, సర్పంచ్‌ ఆళ్ల రాము, రమేష్‌, గంగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రసవాలు ప్రభుత్వ వైద్యశాల్లోనే జరిగేలా చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్‌ శ్రావణ్‌కుమార్‌

పామర్రు: అన్ని ప్రసవాలు ప్రభుత్వ వైద్యశాలలోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కో–ఆర్డినేటర్‌ ఆఫ్‌ హాస్పిటల్‌ సర్వీసెస్‌(డీసీహెచ్‌ఎస్‌) అధికారి శ్రావణ్‌కుమార్‌ అన్నారు. స్థానిక సీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లతో పాటు ల్యాబ్‌లను ఆపరేషన్‌ థియేటర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓఆర్‌ఎస్‌ ద్రావణాలను ప్రజలకు పంపిణీ చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో ఓపీల శాతాన్ని మరింతగా పెంపుదల చేయాలన్నారు. పామర్రు సీహెచ్‌సీ వైద్యులు నీలిమ, దీప్తి, నాగేశ్వరరావు, బదరీనాథ్‌ పాల్గొన్నారు.

ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు లక్ష్మీనారాయణపురం గ్రామంలో పునః నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పండితుల వేద మంత్రాల మధ్య పలువురు దంపతుల దీక్షధారణలతో ఉదయం పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, సాయంత్రం అంకురారోపణ, ధ్వజారోహణం, శ్రీ సీతారామలక్ష్మణ సహిత అభయాంజనేయస్వామి విగ్రహాలకు ధాన్యం, క్షీరం, నీళ్లు, పూలతో అధివాసాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పార్టీకి బాబ్జీ రాజీనామా

ముదినేపల్లి రూరల్‌: కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి ఎంఎస్‌వీఆర్‌ గాంధీ (బాబ్జీ) శుక్రవారం రాజీనామా చేశారు. దీనికి సంబంధించిన వివరాలను మండలంలోని శ్రీహరిపురంలో ఆయన వివరించారు. 35 ఏళ్లుగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్నప్పటికీ సార్వత్రిక ఎన్నికల్లో తనకు సరైన గుర్తింపు ఇవ్వకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంతో మనస్థాపానికి గురై పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు పార్టీ మండవల్లి, కలిదిండి మండల అధ్యక్షులు సోము కాశీవిశ్వనాథ్‌, కేశిరెడ్డి వెంకట శివరామకృష్ణ రాజీనామా చేసినట్లు వివరించారు. రాజీనామా పత్రాలను పీసీసీ అధ్యక్షురాలికి పంపుతున్నట్లు తెలిపారు.

ప్రకటన

[illegible]

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com